వాత్స్యాయనుడివారసుడిలా వున్నాడు దర్శకుడు. హీరోయిన్ కలగంటూంది చాలా ఘోరంగా. వచ్చిగా, కైపెక్కి. కపెక్కి ఒకరినొకరు పెనవేసుకుపోతున్నారు. దొర్లుతున్నారు. ఇద కొట్టున్నారు.

సీరియస్‌గా సినిమా చూస్తున్న నాకు 'రాణి' పిలుపు డిస్టర్బెన్స్ అనిపించి "ఎందుకే" అన్నాను.

"ఇవ్వవే తర్వాత చెప్తాను" అంది.

నా తలలో పక్కపిన్ను తీసి దానిచేతికిచ్చాను.

హీరో హీరోయిన్లు పొర్లి దొర్లి. అలసి సొలసి మరి ఆడలేక పాటముగించేశారు. రాణి ఎందుకో ముందుకు వంగి తన కాళ్ళదగ్గరకు చెయ్యి పోనివ్వడం నేను గమనించే లోపల కెవ్వుమన్న కేకకు హాల్లోని దద్దరిల్లిపోయింది. వెనక్కు తిరిగా— ఒక అందగాని కేకది.

సినిమా మొదలైనప్పటి నుంచి అతను విపరీతంగా ప్రవర్తించాడట. వెనుక నుంచి అతని కాళ్ళతో రాణి కాళ్ళను పయ్యాటలార్డం మొదలెట్టాడట. అప్పటికీ రాణి తన కాళ్ళను ముందుకు జరుపుకుని కూర్చుంది. పట్టువదలని విక్రమార్కునిలా యింకాస్త అడ్వాన్సయి పదరు అందగాడు తన బొటన వ్రేలితో రాణి పాదాల దగ్గర నుంచి పిక్కల వరకూ.....భరించలేక తలపిన్నుతో కసికొద్దీ అతని పాదంలో బలంగా గుచ్చిందంతే....

కుంటుతూ అతగాడు తుర్రుమంటే విషయం టూకీగా విన్న నలుగురూ నవ్వుతున్నారు—

●

---

అది ఆంధ్ర పారిస్ నుంచి గుంటూరు పట్టణానికి వెళ్ళే పాసింజర్ రైలు. కదులుతున్న మానవ ప్రదర్శనశాలలా వుందా రైలు. అందులో తెనాలి సుబ్బారావు పాట పాడుతున్నాడు రైల్లో. అతను అద్వైతసిద్ధికోసం పాడటంలేదు. అమరత్వ లబ్ధికోసమూ పాట్టం లేదు. చావకుండా బతకటం కోసం పాడుతున్నాడు. కళ కోసం పాడటం లేదు. చిల్లర కాసుల




కోసం పాడుతున్నాడు. జనం కోసం పాడటం లేదు. తన కోసమే పాడుతున్నాడు. సినిమా పాటలు. భక్తి పాటలు. దేశభక్తి పాటలు. ఆకలి పాటలు అన్నిరకాల పాటలు పాడుతున్నాడు. రెండర్థాల పాటలు తప్ప. జనాన్ని తప్పుకుంటూ. రకరకాల పందళ్ళని తట్టుకుంటూ. పద్మవ్యూహం లాటి రైల్లో గుడ్డి అభిమన్యుడిలా పాడుతున్నాడు. టికెట్ చెకింగ్ స్క్వాడ్ రైడ్ చేస్తున్నారు. సుబ్బారావు పాడుతూనే వున్నాడు. బియ్యం గుంటూరుకు దొంగ రవాణా అవుతున్నాయి. సుబ్బారావు పాడుతూనే వున్నాడు. పోలీసులు మామూళ్ళు అడుక్కుంటున్నారు. సుబ్బారావు చేయి జాపి పాడుతూనే వున్నాడు. ప్రయాణీకులు "అమ్మ — అన్న" రాజకీయాలను గురించి పెద్ద గొంతుకులతో చర్చించుకుంటున్నారు. సుబ్బారావు గళం విప్పి పాడుతూనే వున్నాడు. ఆడవాళ్ళు చీరలను గురించి. రిబేట్ల గురించి ముచ్చటించుకుంటున్నారు. సుబ్బారావు ముచ్చటగా పాడుతూనే వున్నాడు సీజన్ టికెట్లపై తిరిగే ఉద్యోగస్తులు చతుర్ముఖ పారాయణం చేస్తున్నారు. సుబ్బారావు గానం చేస్తూనే వున్నాడు. రైలు సాగిపోతూనే వుంది. సుబ్బారావు యాంత్రికంగా పాడుతూనే వున్నాడు.

ఈ రోజే కాదు. గత కొన్ని సంవత్సరాలుగా సుబ్బారావు రైల్లో పాటలు పాడుతూనే వున్నాడు మంత్రులు మారుతున్నారు. సుబ్బారావు పాడుతూనేవున్నాడు. అంధులు హక్కులకోసం అసెంబ్లీ ముందు లాఠీ దెబ్బలు తిన్నారు. సుబ్బారావు పాడుతూనే వున్నాడు. అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరం జరిగిపోయింది. సుబ్బారావు పాడుతూనే వున్నాడు. నాయకులు వాగ్దానాల వర్షాలు కురిపిస్తున్నారు. సుబ్బారావు ప్రవాహంలా పాడుతూనే వున్నాడు.

ఒక్కసారిగా పాడుతున్న పాట ఆగిపోయింది. పొరపాటున సుబ్బారావు ఓ ప్రయాణీకుడి కాలు తొక్కటంతో.

పదరు ప్రయాణీకుడు అగ్గిలా భగ్గుమన్నాడు. బిచ్చగాళ్ళను అనుమతిస్తున్నందుకు రైల్వేవాళ్ళమీద విసుక్కున్నాడు. బిచ్చగాళ్ళను తమ రాష్ట్రం నుంచి తరిమేస్తున్నందుకు తమిళనాడు ప్రభుత్వాన్ని మెచ్చుకున్నాడు. సుబ్బారావు అంధుడు కాడనీ. సుబ్బరంగానే కనబడుతుందనీ, అంతా నటననీ అన్నాడు. కేవలం సోమరితనమన్నాడు. ఈ బిచ్చగాళ్ళు ప్రతి రోజూ తాగుతారనీ. మట్కాజూదం ఆడతారనీ. వీళ్ళకు బ్యాంకు నిల్వలు కూడా వుంటాయనీ అన్నాడు. రైళ్ళలో వీళ్ళకు టికెట్ అవసరం లేదనీ, అసలెవరూ వీళ్ళని టికెట్ అడగరనీ. రైళ్ళు వీళ్ళ సొంతమనీ. వీళ్ళ కోసమే రైళ్ళు వేసారనీ వాపోయాడు. వీళ్ళు రైళ్ళలో. ఎంచక్కా ఏ వూరు చూడాలంటే ఆ వూరు తేరగా పోవచ్చనీ ఈర్ష్య పడ్డాడు. ఈ వుద్యోగాలకంటే. వ్యాపారాలకంటే. వ్యవసాయాలకంటే అడుక్కోవటమంత హాయి లేదన్నాడు. తను బిచ్చగాడిగా పుట్టనందుకు చాల బాధపడ్డాడు.

సుబ్బారావు గాజు కళ్ళతో ఓ జీవం లేని నవ్వు నవ్వాడు. "బాబూ మీరంత బాధపడమాకండి. మీరంటంతా అచ్చరాలా నిజం. అందుకని మీ ఆస్తీ-పాస్తీ. పొలం-పుట్రా డబ్బు-దస్కం నా మొఖాన పారేయండి. ఆ బాదలేంటో నేనే పడతాను. నా జోలె. చిడతలు తవరికిస్తాను. ఆయిగా రైల్లో అడుక్కు తింటా రోజూ సారా తాగుతా. జూదం ఆడతా. బ్యాంకి నిలవ పెంచుకుంటూ సుకపడిపోండి!"

ఆ దెబ్బతో పదరు ప్రయాణీకుడికి— కంటి చూపేగాని నోటి మాట పెగల్లేదు. చీమ చిటుక్కుమంటే వినపడేంత నిశ్శబ్దం అయిపోయింది రైలుపెట్టె.

రైలు మాత్రం పరుగెడుతూనే వుంది.

●